


(గత సంచిక తరువాయి)

విరించి, “సర్!! ఈ సిస్టం కావాలంటే మీరు వాడుకోండి. కానీ దానికన్నా ముందు మీరు నాకు ఇక్కడేం జరుగుతుందో చెప్పాలి.....” అన్నాడు.

భీష్మ, “విరించీ!! ఇది చిన్నపిల్లల ఆటలు కాదు....” అంటూ సిస్టం ఆన్ చేశాడు.

భీష్మ సిస్టం స్క్రీన్ వంక చూసి కోపంతో “విరించీ!!” అన్నాడు.

“సర్!! ఆ లాక్ నాకు మాత్రమే తెలుసు. మీరు నాకు అసలు విషయం చెపితేనే ఆ పాస్వర్డ్ మీకు చెబుతాను లేదంటే.....” అని సాగతీశాడు విరించి.

ఆర్యాకు కోపం వచ్చి లాగిపెట్టి కొట్టడానికి దూకుడుగా అడుగులు వేయబోయాడు.

ద్రోణా వద్దని వారించి, “ముందు ఆ పాస్వర్డ్ చెప్పు, ఇక్కడేం జరుగుతుందో నేను చెబుతాను......” అన్నాడు.

విరించి, “భీష్మ సర్!! 12345” అన్నాడు.

ఆర్యా, “వార్నీ ఇదేనా పాస్వర్డ్....!!” అని క్లుప్తంగా కొన్ని వాక్యాల్లో అసలు విషయం చెప్పాడు.

విరించికి నోటమాట రాలేదు.

ద్రోణా వంక ఆశ్చర్యంతో చూస్తూనే వున్నాడు.

ఈలోగా డిటెక్టర్ ఛార్జ్ అయ్యింది. ఆర్యా సహాయంతో ద్రోణా సిస్టం ముందుకు వెళ్లి తన డిటెక్టర్‌ను సిస్టంకు కనెక్ట్ చేశాడు. దాని ద్వారా వచ్చే ఔట్‌పుట్‌ను వాడుకుని వచ్చిన ఫలితాలను సిస్టంలో వేసి మ్యాపింగ్ చేయడం స్టార్ట్ చేశాడు.

విరించి, “మీరు ఏలియన్ అయితే మీ టెక్నాలజీ మా దగ్గర ఎలా పనిచేస్తుంది? అసలు మీ డివైజ్ మా వాటికి ఎలా కనెక్ట్ అయ్యింది?” అనడిగాడు.

ఆర్యా, “ఇదేమీ నీ క్లాస్‌రూమ్ కాదు, డౌట్స్ అడగడానికి....” అన్నాడు కోపంగా,.

ద్రోణా, “అవును!! ఈ డిటెక్టర్ మీ భూమ్మీద ఉన్న వాటి కంటే అడ్వాన్స్. దీన్ని కనెక్ట్ చేసి, ప్రోసెస్ చేసేంత సామర్థ్యం వేటికీ లేదు. కానీ, నేను దీన్ని మాడిఫై చేసుకుంటూ వచ్చాను. ఆ పేలుడు తర్వాత అగస్త్యను పట్టుకోవడానికి

మరో మార్గం లేకపోయింది. అప్పుడే ఆ శకలాల మధ్య వెతికి మరీ దీన్ని వెనక్కి తెచ్చుకున్నాను. ఆ పేలుడు వల్ల ఇది కూడా పార్షియల్‌గా దెబ్బతింది. దీన్ని మీ భూగ్రహ టెక్నాలజీకి అనుగుణంగా మార్పులు చేసుకుంటూ వచ్చాను. దీనికో ప్రత్యేకత ఉంది. దీనిలో ఉన్న నానో మైట్స్ వల్ల దీన్ని సులభంగా హైడ్ చేయొచ్చు అలాగే దీన్ని యూజ్ చేయడం కూడా చాలా సులభం" అన్నాడు.

విరించి, "నానో మైట్ టెక్నాలజీనా....!?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"యస్!! నానో టెక్నాలజీనే...." అంటూ డిటెక్టర్ వంక చూసాడు ద్రోణా.

డిటెక్టర్ డిస్‌ప్లే మీద ఫుల్ ఛార్జ్ చూపించడం గమనించాడు. వెంటనే దానిని చేతిలోకి తీసుకున్నాడు. దానిని ఆపరేట్ చేస్తూ, వేళ్ళను వేగంగా కదిలించాడు.

ఆర్యా అతని వంక అనుమానంగా చూస్తూ మెల్లిగా భీష్మకు మాత్రమే వినిపించేలా, "సర్!! వీడ్ని చూస్తుంటే నాకు భయంగానూ ఏదో అనుమానంగా ఉంది" అన్నాడు.

భీష్మ, "మనకి వీడు తప్ప సోర్స్ లేదు కదా?" అన్నాడు.

ఆర్యా, "ఓ పని చేద్దాం సర్!! మన గవర్నమెంట్‌కి సమాచారం ఇద్దాం., వాళ్ల సైడ్ నుండి మనకేదైనా హెల్ప్ చేస్తారేమో చూద్దాము...." అన్నాడు.

భీష్మ, "ఎవరికి ఎన్ని చెప్పినా వీడ్ని ఒక ఏలియన్‌గా చూస్తారు. వీడ్ని బంధించి వీడి మీద ప్రయోగాలు చేస్తామంటే మనం ప్రభుత్వాన్ని ఎదుర్కోలేము. ఇక్కడ అంటే నువ్వు నేను మాత్రమే ఒప్పుకోవాలి. కానీ ప్రభుత్వానికి తెలిస్తే మాత్రం దీనికి చాలామంది అప్రూవల్ కావాలి. ఈలోపు వీడు చెప్పిన వినాశనం జరిగితే మాత్రం మన తప్పుని మరో ఏడు జన్మలెత్తినా దిద్దుకోలేము" అన్నాడు.

అప్పుడు ఆర్యా, "ఒకవేళ...! వీడి వల్లనే భూమికి ప్రమాదం వస్తే.....!?" నెమ్మదిగా తన సందేహాన్ని అడిగాడు.

భీష్మ, "ఇప్పుడు నన్నేం చేయమంటావో చెప్పు?" అని తిరిగి తానే ప్రశ్న అడిగాడు.

ఈలోగా ద్రోణా, "యస్!! లొకేట్ అయ్యింది" అంటూ సిస్టంకు డిటెక్టర్ కనెక్ట్ చేశాడు.

ఆర్యా వంక చూస్తూ భీష్మ దాన్ని ప్రోసెస్ చేశాడు.

నేరుగా లొకేషన్ కో ఆర్డినెంట్స్ వచ్చాయి.

వాటిని లొకేట్ చేసి చూశాడు.

లొకేషన్ వంక చూసి ద్రోణా కళ్ళు ఒక్కసారిగా మెరిసాయి. భీష్మ లొకేషన్ వంక అలానే చూస్తుండిపోయాడు. ఆర్యాకు నోటమాట రావడం లేదు. ఆశ్చర్యంగా ఆ ఇద్దరూ చూస్తూనే వున్నారు.

వెనుక నుండి చూస్తున్న విరించి, "ఓహో సూపర్!! సి.ఎం.ఓ కార్యాలయంలో ఉన్నాడా?" అని నోటి మీద చెయ్యేసుకున్నాడు.

ద్రోణా, "పదండి అక్కడికి పోదాం...." అన్నాడు.

ఆర్యా, "ఏంటి పోయేది..!? అది చీఫ్ మినిస్టర్ ఆఫీస్, ఇష్టం వచ్చినట్టు వెళితే పిట్టల్ని కాల్చినట్టు కాల్చేస్తారు......" అన్నాడు.

ద్రోణా, "మరి ఆ అగస్త్య అక్కడే వున్నాడు కదా!? అంటే మనం కూడా అక్కడికి వెళ్లొచ్చు....." అన్నాడు.

భీష్మ, "ఇప్పుడదే పెద్ద సమస్య., అగస్త్య నేరుగా అక్కడికెళ్లాడంటే ప్రమాదం మరింత ముదిరినట్టే" అన్నాడు.

ద్రోణా, "యస్!! అందుకే మనం త్వరగా అక్కడకు చేరుకోవాలి......" అన్నాడు.

భీష్మ, "సరే!! ఇప్పుడు టైమ్ మూడవుతుంది. ఇప్పుడు అక్కడకు వెళితే మన ప్రాణాలు పోతాయి. రేపు ఉదయమే వెళ్దాము. ఈలోపు ఇక్కడే రెస్ట్ తీసుకోండి......" అన్నాడు.

ద్రోణా, "రేపు ఉదయమంటే మీ భూమి ఆయుష్షును మీరే కొన్ని గంటలు తగ్గించినవాళ్ళవుతారు" అంటూ గోడకు వరకూ అడుగులు వేసి గోడకు ఆనుకుని కూర్చున్నాడు.

విరించి ద్రోణా పక్కన ఆసక్తిగా కూర్చున్నాడు.

భీష్మ, ఆర్యా వాళ్లకి ఎదురుగా ఉన్న మరొక గోడకు ఆనుకుని కూర్చున్నారు.

ద్రోణా మరొక గ్రహం నుండి రావడంతో అతన్ని విరించి అనేక ప్రశ్నలడిగాడు. ద్రోణా కొన్నింటికి జవాబులు చెబుతూ కొన్నింటికి మౌనంగా ఉండిపోయాడు.

ఆర్యా, 'రేపు సి.ఎం.ఓ లో ద్రోణా విషయం మనవాళ్ళకి చెబుదాము' అని సందేశం పంపాడు.

భీష్మ, 'నాకూ అదే మంచిదనిపిస్తుంది' అని సమాధానం ఇచ్చాడు.

ఆర్యా, 'ఓకే!!' అని ప్రతి సమాధానం పంపి భూమ్మీద వస్తున్న మార్పులు గురించి వార్తలేమైనా వస్తున్నాయేమోనని తనిఖీ చేయడం ఆరంభించాడు. వచ్చిన ఫలితాలు అతన్ని ఆశ్చర్యపరిచాయి. వాటిని భీష్మకు షేర్ చేశాడు. బెర్ముడా వద్ద అలజడి మొదలైందని తెలుసుకున్నారు.

ఆర్యాకు అకస్మాత్తుగా వశిష్ఠ గుర్తొచ్చి అతని గురించి గూగుల్ సెర్చ్ చేశాడు. కొన్ని వందల సంఖ్యలో ఫలితాలు వచ్చాయి. వశిష్ఠ పేరు మీద అనేక సైట్స్ పేజెస్ క్రియేట్ చేసి పెట్టాయి. వశిష్ఠ గురించి పూర్తిగా చదివాడు.

పక్కనే ఉన్న భీష్మ వంక చూసాడు. భీష్మ కళ్ళు మెల్లిగా మూతలు పడటం గమనించాడు. అతన్ని కదిలించకుండా ద్రోణా వైపు చూశాడు. ద్రోణా, విరించి చిన్ననాటి స్నేహితుల వలే మాట్లాడుకోవడం చూసి ఆశ్చర్యపడ్డాడు.

మరలా వశిష్ఠ గురించి చదువుతూ, 'వశిష్ఠ గొప్ప సంపన్న కుటుంబంలో పుట్టిన అత్యంత మేధాసంపత్తి కలిగిన యువశాస్త్రవేత్త. వశిష్ఠ ఆడ్వాన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ మీద అనేక పుస్తకాలు రాశాడు. వశిష్ఠ కనిపెట్టిన టైం సీక్వెన్స్ ఎనలైజర్ నోబెల్ బహుమతి తెచ్చిపెట్టింది. అలాగే వశిష్ఠకు వచ్చిన పారితోషికాలన్నీ కూడా తాను నేతాజీ ఫౌండేషన్ అనే ఆర్ఫనేజ్‌కు డోనేట్ చేశాడు. పరిశోధనలకు ఆటంకం కలుగుతుందని పెళ్లి చేసుకులేదు. మంచి మోటివేషనల్ స్పీకర్' అని తెలుసుకున్నాడు.

వశిష్ఠ గురించి ఆర్యా మనసులో సదభిప్రాయం ఏర్పడింది. అతన్ని నేరుగా కలవాలని ఆశ కలిగింది. ద్రోణా వైపు చూసాడు. ద్రోణా, విరించి ఇద్దరూ నిద్రపోయారు. ఆర్యా సిస్టం ముందుకు చేరుకుని దానికి కనెక్ట్ చేసున్న డిటెక్టర్ చేతిలోకి తీసుకుని, "భూమి వినాశనం అవబోవడం, మేము దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నం చేయడం ఏంటో అంతా కలలా ఉంది. ఇంతా చేసిన ఆ వశిష్ఠ ఏమైపోయాడు. ఇన్ని విషయాలు చెప్పిన ద్రోణా అతడి గురించి మాత్రం ఎందుకు చెప్పడం లేదు. ద్రోణా ఏదో దాస్తున్నాడు. రేపు అక్కడ అగస్త్యను పట్టుకుంటే అన్ని విషయాలు తెలుస్తాయి. ఈలోపు వీడ్ని ఓ కంట కనిపెట్టాలి" అనుకుంటూ ద్రోణా వంక చూసాడు.

ఆర్యా కళ్ళు మండటం ఆరంభించాయి. బైటికి వచ్చి జేబులో ఉన్న సిగరెట్టు తీసి వెలిగించాడు. ఒక్కో దమ్ము లోపలకు పీలుస్తూ, ఆకాశంలోకి చూస్తూ ఆలోచనల్లో మునిగాడు. ఒక్కసారిగా కళ్ళ ముందు తన కుటుంబం కనిపించింది. గుండెల్లో దడ పుట్టుకొచ్చింది. వెంటనే ఇంటికి ఫోన్ చేయాలని ఫోన్ బయటకు తీసాడు. కానీ అర్ధరాత్రి దాటడంతో ప్రయత్నం విరమించుకున్నాడు.

"భయంగా ఉంది కదా?" అంటూ లోపల నుండి ద్రోణా మెల్లిగా నడుచుకొస్తూ అన్నాడు.

ఆర్యా వెనక్కి తిరిగి, "దేనికి భయం!?" అనడిగాడు.

ద్రోణా, "మనకి కావలసిన వాళ్ళు చనిపోతున్నారని తెలిస్తే ఎవరికైనా బాధతో కూడిన భయం వస్తుంది. ప్రస్తుతం నువ్వు అదే పరిస్థితిలో వున్నావు. ఒకప్పుడు నేను కూడా ఇదే పరిస్థితిలో వున్నాను. అందుకే, నా గ్రహాన్ని కాపాడాలని దృఢమైన నిర్ణయం తీసుకున్నాను. అందుకోసం ఏమైనా చెయ్యాలనుకున్నాను. అగస్త్య చెప్పిన పనులు పూర్తి చేశాను కానీ, నా వాళ్ళను కాపాడుకోవడం కోసం మీ గ్రహాన్ని నాశనం చేయడమంటేనే మనసుకి భారంగా అనిపించింది. అప్పుడే మీకు సాయం చేయాలనుకున్నాను. మీ గ్రహం నాన్ లీనియర్ జోన్ ఏర్పడి నాశనమైనా మా గ్రహం ఉనికిలో వుంటుందనే నమ్మకం లేదు అంటే సైంటిఫిక్ ప్రూఫ్ లేదు. అలాంటప్పుడు మీ గ్రహాన్ని నాశనం చేసి ఉపయోగం ఏంటి? మీక్కూడా మాలా కుటుంబం ఉంటుంది. మేమెలా దానికోసం పాటుపడుతున్నామో అలాగే మీరు కూడా చేస్తారు. మాకుండే ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు మీక్కూడా ఉంటాయి. మా వాటికి మేమెంత విలువిస్తామో మీరు కూడా ఇస్తారు. ఏ దృక్కోణంలో చూసినా మీ గ్రహాన్ని నాశనం చేయడం తప్పే. ఒకవేళ మీ గ్రహం నాశనమై మా గ్రహం బాగుంటే నేను

బ్రతికున్నంత కాలం కొన్ని వందలకోట్ల ప్రాణాలు తీసిన హంతకుడుగా జీవితం గడపాలి. ఆ జీవితం నాకొద్దు. బ్రతికిన కొన్ని రోజులైనా సంతోషంగా సంతృప్తిగా బ్రతుకుతాను" అని మెట్ల మీద కూర్చున్నాడు.

ఆర్యా, "నాకో నిజం చెప్పు ద్రోణా..!!" అనడిగాడు.

ద్రోణా, "ఇప్పటివరకూ నేను చెప్పినవి అవే....!!" అన్నాడు.

"అసలు ఇదంతా జరుగుతుందంటే నాకు నమ్మబుద్ధి కాలేదు. నువ్వు మా గ్రహాన్ని కాపాడతావని, నువ్వు చెప్పే అన్ని పనులు చేస్తున్నాము తప్ప., అసలైన నిజమేంటో మాకర్థం కాదు, కాలేదు. సైన్స్ ఇంత గొప్పగా అభివృద్ధి చెందిన తర్వాత కూడా నేను నమ్మకపోతే నన్ను పిచ్చోడు అంటారు. పైగా సాక్ష్యం నువ్వున్నావు కదా? కానీ నిన్ను నమ్మడం ఎలా? నువ్వు మా బలహీనతను వాడుకుని భూమిని నాశనం చేసేది నువ్వే అయితే, మాకెలా తెలుస్తుంది? తెలియదు., గుడ్డిగా నిన్ను నమ్మాలి అంతే., నిజం చెప్పు! నువ్వు మాకు సహాయం చేస్తున్నావా? మోసం చేస్తున్నావా?" అని సూటిగా కళ్ళలోకి చూసి అడిగాడు ఆర్యా.

ఆర్యా మాటలకు ద్రోణా కొంచెం నొచ్చుకున్నట్టుగా మొహం పెట్టుకొని, "చూడు ఆర్యా!! నువ్వు నా బ్లడ్ తీసుకున్నావు కదా? ఎందుకని నేను నిన్ను అడగలేదు. కారణం, అకస్మాత్తుగా ఎక్కడినుండో వచ్చిన నాపై మీకు ఎన్నో అనుమానాలు ఉంటాయి. వాటిని తీర్చుకోవాలి. అప్పుడే నామీద మీకు నమ్మకం కలుగుతుంది. ఆ నమ్మకమే నాకు కావాలి. కారణం, నేను మిమ్మల్ని భయపెట్టి ఈ పనిని చేయలేను కారణం నువ్వు ఊహించుకో.., నువ్వు ఇక్కడివరకూ వచ్చావంటే కారణం ఆ బ్లడ్ టెస్ట్ రిపోర్ట్స్ నాకు అనుకూలంగా రావడమే. నా వెనుక నువ్వు డయాగ్నోస్టిక్ టెస్ట్ రన్ చేశావని తెలిసి కూడా నేను కామ్‌గా వున్నాను. ఎందుకంటే మీ నమ్మకం దానిమీదనే ఆధారపడి ఉంది. నువ్వు నామీద మొదటినుండే అనుమానంగా ఉన్నావని నేను పసిగట్టాను. అందుకే నేను వీలైనంత క్లియర్‌గా మీకు గతం చెప్పాను. నన్ను నేను ప్రూవ్ చేసుకున్నాను. ఇన్ని చెప్పినా నువ్వు నన్ను నమ్మడం లేదంటే నేనేం చేయలేను కానీ, నా ప్రయత్నం మాత్రం ఆపను. మీ భూమిని అగస్త్య నాశనం చేయడానికి నేను కూడా ఓ పనిముట్టులా ఉపయోగపడ్డాను. వాడ్ని ఎలా అపాలో నాకు బాగా తెలుసు. మీ సహాయం ఉంటే సులభంగా వాడ్ని పట్టుకుంటాను లేదంటే మరొకరిని అడుగుతాను. ఎవరూ నాకు సహాయం చేయలేదా? నేను ఒంటరిగానే వాడ్ని వెతికి పట్టుకుంటాను. ఈలోగా భూమి కాలక్రమంలో మార్పులు వచ్చి వినాశనం స్టార్ట్ అయితే మాత్రం నేనేం చేయలేను" అంటూనే అతని మొహం దిగాలుగా మారింది. అది ఆర్య చూస్తుండగానే, ద్రోణా అక్కడినుండి తిరిగి లోపలికెళ్లాడు.

ఆర్యా, 'నా అంచనా తప్పయిందా? వీడు.......' అనుకుంటూ ల్యాబులోకి అడుగులు వేశాడు.

భీష్మ మగతగా అటూ ఇటూ కదులుతూ కనిపించాడు. విరించి పక్కన ద్రోణా కూర్చుని తన భుజాన్ని ఆసరాగా ఇచ్చి తాను కళ్ళు మూసుకున్నాడు.

ఆర్యా, 'చూద్దాం ఏం జరుగుతుందో...!? ఎవడు తోక జాడించినా వాడ్ని చంపడమే, నా దగ్గర మరో అప్షన్ లేదు.....' అనుకుంటూ తుపాకిని తాకుతూ అనుకున్నాడు.

మెల్లిగా భీష్మ పక్కన కూర్చుని ద్రోణానే చూస్తూ కళ్ళు మూసుకున్నాడు.

సమయం గడిచింది, పూర్తిగా తెల్లవారింది. ద్రోణా అలసిపోయిన శరీరం తిరిగి శక్తిని పుంజుకుంది. ఉత్సాహంగా లేచాడు. అప్పటికే ఆర్యా, భీష్మ లేచి బయట నిలబడి మాట్లాడుకుంటూ వున్నారు. పక్కన పడుకున్న విరించిని నిద్రలేపి తనతో పాటు బయటకు తీసుకెళ్లాడు. ఈలోగా యూనివర్సిటీ లోపలకు ఓ కారు వచ్చింది. కారు నడిపిన అతను కారు దిగి తాళాలు నేరుగా భీష్మకు ఇచ్చి ల్యాబ్‌ల వైపు వెళ్ళిపోయాడు.

ఆర్యా కారెక్కుతూ, "ద్రోణా! రా వచ్చి కారెక్కు.." అన్నాడు.

ద్రోణా, విరించి వంక చూసాడు.

భీష్మ, "మన ముగ్గురం మాత్రమే వెళ్తున్నాము., అక్కడేమైనా జరిగితే వాడి భవిష్యత్తు దెబ్బతింటుంది...." అన్నాడు.

ద్రోణా, "ఈక్షణం భూమ్మీద ఏ ఒక్కరికి భవిష్యత్తు లేదని మీకు తెలుసు.., మరి విరించికి మాత్రం భవిష్యత్ ఎలా ఉంటుంది. వాడి భవిష్యత్ కోసం వాడు పోరాడతాను అంటున్నాడు. వాడ్ని కూడా మనతో పాటు తీసుకెళదాం...." అని, "రా విరించి నువ్వు కూడ కారెక్కు.." అన్నాడు.

విరించి, ఆర్యా వంక చూసాడు. ఆర్యా సమ్మతమేనంటూ తలాడించాడు. విరించి ఒక్క ఉదుటున కారులోకి ఎక్కాడు. భీష్మ కారు నడుపుతుంటే పక్కనే ద్రోణా, వెనుక సీటులో ఆర్యా, విరించి కూర్చున్నారు.

కారు యూనివర్సిటీ నుండి బయటకు రాగానే, "అందరూ వినండి, ఈ కారు యూనివర్సిటీది. మనం ఇప్పుడు యూనివర్సిటీ పనిమీద సి.ఎం.ఓ ఆఫీస్‌కు వెళ్తున్నాము. నేను ఉదయమే అరేంజ్‌మెంట్స్ చేశాను. అక్కడ మనం అగస్త్యను పట్టుకుని నేరుగా పోలీసులకు అప్పగించాలి. ఆ తర్వాత ద్రోణా ఎలా చెపితే అలా చేద్దాము. ముందే పోలీసులకు మనం సమాచారం ఇస్తే వాడు తప్పించుకునే ప్రమాదం ఉంది" అంటూ కారులో సిద్ధంగా ఉన్న డమ్మీ యూనివర్సిటీ ఐడీ కార్డ్స్ వాళ్ళకి ఇచ్చాడు.

ఆర్యా కూడా కార్డ్ తీసుకోబోతుంటే, "ఆర్యా!! నీకక్కర్లేదు. నువ్వు నేరుగా ఆఫీసులోకి ఎంటర్ కావొచ్చు" అన్నాడు.

ఆర్యా చిన్నగా నవ్వి, "అవును కదా!?" అన్నాడు.

మధ్యలో ద్రోణా, "మీరంతా అగస్త్యను ఎలా గుర్తుపడతారు?" అనడిగాడు.

ముగ్గురి నుండి ఎటువంటి సమాధానం రాలేదు.

ద్రోణా, "అగస్త్య దగ్గర మీ టైమ్ జోన్‌లో ఉన్న వాచ్ పెడితే అది అపసవ్యదిశలో తిరుగుతుంది. వాడు ఆరడుగుల ఎత్తు ఉండి, జుట్టంతా తెల్లబడి ఉంటాడు. ముసలివాడు కాదు. తెల్లగా ఉంటాడు. అగస్త్యను మీరు గుర్తించి నాకు చెప్పండి చాలు. వాడ్ని ఎలా అడ్డుకోవాలో నేను చెబుతాను. మీరు మాత్రం తొందరపడి మనకి దొరికిన అవకాశాన్ని నాశనం చేయొద్దు" అన్నాడు.

భీష్మ, "ద్రోణా!! అలా వద్దని చెప్పాను కదా? వాడ్ని మనం గుర్తించి పోలీసులకు సమాచారం ఇస్తాము. వాళ్లే అతడ్ని పట్టుకుంటారు" అన్నాడు.

ద్రోణా నెత్తికొట్టుకుంటూ, "వాడు ఒక ఏలియన్, వాడికి అనుమానం వస్తే ఒక్క క్షణంలో అక్కడనుండి వెళ్ళిపోతాడు. నువ్వెళ్లి పోలీసులకు విషయం చెప్పి, వాళ్ళు అర్థం చేసుకుని సిద్ధమయ్యేలోపు వాడు ఎక్కడో ఉంటాడు. వాడ్ని మళ్లీ ట్రేసౌట్ చేయడం కష్టం. వాడిని ఆపడం మీవల్ల కాదు. నన్ను నమ్మండి వాడ్ని నేను ఆపుతాను. ఆ తర్వాత మీరు ఒక్కసారిగా వాడిమీద దాడి చేసి బంధించండి" అన్నాడు.

ఆర్యా, "అవును ద్రోణా చెప్పినట్టు చేద్దాం. ఇదే బెటర్ అనిపిస్తుంది" అన్నాడు.

భీష్మ, "సరే అలాగే చేద్దాం..." అంటూ వేగం పెంచి సి.ఎం.ఓ ఆఫీస్ వద్ద కారాపాడు.

నలుగురూ కిందకి దిగారు. ఆర్యా వాళ్ళనుండి విడిపోయి అక్కడున్న ఫోర్స్‌తో కలిసిపోయాడు. మిగిలిన ముగ్గురూ సెక్యూర్టీ చెకప్ దగ్గర వరుసలో నిలబడ్డారు. ఆర్యా సులభంగా లోపలకు వెళ్ళాడు. కొన్నినిమిషాల అనంతరం మిగతావాళ్ళు కూడా సెక్యూర్టీ చెకప్ దాటి లోపలకు చేరుకున్నారు.

లోపలకు నడుస్తుంటే, "సర్!! ఇంత త్వరగా మీకెలా పర్మిషన్ వచ్చింది?" అనడిగాడు విరించి.

భీష్మ, "దీనికి పెర్మిషన్ అవసరం లేదు, మనం యూనివర్సిటీకి ప్రత్యేకనిధులు కేటాయించమని అర్జీ పెట్టుకోవడానికి వచ్చాము. మనం ఇక్కడ వుండే స్టాఫ్‌ను మాత్రమే కలుస్తాము., సి.ఎం ని కాదు" అంటూ వరుసలో ఉన్న సాధారణ జనాన్ని కూడా చూపించాడు.

విరించికి అసలు విషయం అర్థమై, "ఓహో!!" అనుకుంటూ అగస్త్యను వెతుకుతూ వాళ్ళ నుండి దూరంగా అడుగులు వేశాడు.

**(కొనసాగింపు వచ్చే నెలలో)**

COMMENTS